# అన్నీ వంకర గీతలే

( ఉపన్యాస వ్యాస కథ ! )

తొ లి ప లు కు :

నేనిలా నిక్కచ్చిగా అడుగుతున్నానని మీరేమీ అనుకో వద్దని మనవి చేస్తున్నాను.

ఒక్కసారి నిన్న మొన్నటి రోజుల్ని గుర్తుతెచ్చుకోండి. 1947 లో బియ్యం బస్తా ఎంత ? 1960 లో ఎంత ? 70 వచ్చేసరికీ ఎంత అయింది ? పోనీ 77 లో 133. ఒప్పుకుంటారు గదా.

మరి ఇవ్వాళ 400 రూపాయలు. ఏఁవిటీ దారుణం. ఒక్కసారి ఆలోచించండి. బస్ ఛార్జీల సంగతి ఏఁవిటి ? నేనేమీ వివరించ నక్ఖర్లేదు.

ఇక పాల సంగతి. తలచుకుంటే కడుపు రగిలిపోతుంది. మొన్న మొన్నటిదాకా లీటరు ఒకటీ ఇరవై. ఇవ్వాళ నాలుగు రూపాయలు. అవయినా, లూజ్‌గావస్తే లీటర్‌కి మీకు దక్కేది ముప్పావు లీటరే. అదేమని నోరెత్తితే ఆ మర్నాటినుంచీ మీకు టోటల్‌గా పాలు బంద్ అయిపోతై. అవునా, కాదా ?

వేరుశనగనూనె 1960 లో వీశె రెండున్నర. ఇవ్వాళ వీశెల్లెక్ఖలేదు. కిలో ఇరవై ఆరు.

ఇంతెందుకు—ఆవకాయ, ఏదీ ఆంధ్రుల అభిమాన ఊరగాయ తిందామని సాహసం చేశారా కాయ మూడు రూపాయలకి గిట్టుబాటవుతుంది—అన్ని దినుసులూ కలిపితే. అందుకని సామాన్యుడు ఊరగాయని తలచుకుని నోరూరించుకో వలసిందే. అవును గదా !

ఇవన్నీ ఎందుకు సార్. పెన్సిలు ఖరీదు, నోట్ బుక్ రేటు ఆలోచించండి. కళ్ళు తిరుగుతై.

ఒక్కమాట. వీటన్నిటినీ భరించి, సహించి ఈ చెప్పు క్రింది తేలు వ్యవస్థకి అలవాటుపడ్డామని మనల్ని మనం నిందించుకుంటూ దులపరించుకుని తిరుగుతున్నాం—సరే.

ఒక దురన్యాయాన్ని చిత్తగించండి. ప్రభుత్వంవారు క్రిందటి సంవత్సరం అచ్చేయించి ఎంతో కొంత వెల నిర్ణయించిన పాఠ్య పుస్తకాలు, ఈ సంవత్సరం రేట్లమీద వేరే అధిక వెలకి కాగితమ్ముక్కలు అంటించుకొని దర్శనమిస్తున్నయ్. ప్లీజ్ థింక్. తయారుచేయడానికి పట్టిన ఖర్చులో మార్పులేదు ; పుస్తకం అదే పుస్తకం. రేటుని ఇవ్వాళ పెంచాల్సిన అవసరం ఏమిటి. చెప్పండి మరి.

మరో విషయాన్ని చిత్తగించండి. మొన్న ముప్పై అయిదు పైసలున్న కవరు ఏభై పైసలకి పెరిగింది. అక్కణ్ణుంచీ 70 పైసలకు ఎదిగింది. అంటే ఒక్కసారి ఎంత శాతం పెరుగుదలో ఆలోచించారా ?

మనదేశం పేద దేశం అని చెప్పుకుంటూ వుంటాం. ఈ నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న స్కైస్క్రేపర్స్‌ని చూడండి. ఈ నగరంలో నగల దుకాణాల్ని చూడండి. అక్కడ రద్దీ చూడండి ఈ నగరంలో బట్టల షో రూమ్‌లు చూడండి. వాటిల్లో చేతులు మారుతున్న నగదుని చూడండి.

ఒక్క విజ్ఞప్తి. ఇవన్నీ విని మీరు నన్ను అభివృద్ధి నిరోధకుడిగా జమకట్టారేమో. కానేకాదు. నేను కొన్ని వాస్తవాల్ని మీ ముందుంచుతున్నాను. అంతే.

మీకు మీరుగా ఆలోచించుకోండి.

ఉద్యోగుల జీతాలు పెరుగుతున్నై. వాటితోపాటు ధరలు చుక్కలకేసి ప్రయాణం చేస్తున్నై.

సామాన్యుడి బాధలూ గాధలూ సామాన్యుడితోనే వున్నై. వాటిని మార్చే నాధుడు లేడు. ఒప్పుకుంటారా ?

మలిపలుకు :

ఆర్థికపరమైన కొన్ని విషయాల్ని ఇంతకుముందు మీ దృష్టికి తీసుకు వచ్చాను.

మరి సమాజంలో సాగుతున్న ఇతర అన్యాయాల మాటేమిటి ?

స్త్రీని స్త్రీగా గౌరవించే కాలం పోయింది. ఆడపడచు కట్టుబానిసగా తయారైంది.

రోజు రోజుకూ స్త్రీలమీద అత్యాచారాలు ఎక్కువౌతున్నై. మానభంగాలూ, మారణహోమాలూ, హత్యలూ, ఆత్మహత్యలూ—ఉదయాన్నే దినపత్రికల్లో దర్శనమిచ్చే ఉదంతాలు ఇవే గదా !

ఎక్కడో ఏదో జరుగుతుంది. నగరంలో ఆ మూల ఏదో కొంపమునిగిందనే వదంతి కార్చిచ్చులా వ్యాపిస్తుంది. అంతే. మనిషిని మనిషి నరుక్కుంటాడు. ఇలా ఎందుకు జరగాలి, ఎందుకు జరుగుతున్నాయో మీరే వితర్కించుకోండి.

మన యువశక్తిని గురించీ ఒక్కసారి ఆలోచించండి. వాళ్ళంతా మార్పుని మనసారా కోరుతున్నారు. కానీ, వాళ్ళని మనం మారనివ్వం.

అసలు నాకు తెలీకడుగుతాను. కాలేజీల్లో యూనియన్లు ఎందుకండీ. చెప్పండి. అవి, అవసరమా అని అడుగుతున్నాను. ఏఏటి కాయేడు ఎన్నికల్లో తలకాయలు బద్దలు కొట్టుకుని అభం శుభం తెలియని మన పిల్లలు చావడానికా ? ఎందుకు ?

మన యువతీ యువకుల్లో తొంభై శాతం వరకట్నానికి వ్యతిరేకమే కదా. మరి కట్నం రేటు ఎందుకిలా కొండచిలువలా సాగిపోతున్నది. చెప్పండి. వరకట్నం చావుల గురించి చదువుతుంటే గుండె నీరై పోతున్నదే !

మరి. మద్యపానం గురించి నేనుగా మీకు చెప్పాల్సిందేముంది ? అడపా దడపా మీరూ చూస్తున్నారు గదా—కల్తీకి బలైపోతున్న అమాయక ప్రాణుల హాహాకారాలు !

మరొక్క మాట. సినిమా ఈనాటి సామాన్యుడికి అందుబాటులోవున్న ఏకైక వినోద సాధనం కదా. అదీ, మనకు గగనకుసుమయ్యే పరిస్థితులు వస్తున్నాయా ? లేవా ? అంతెందుకు—సినిమా టిక్కెట్ల విక్రయంలో బ్లాక్‌మార్కెట్‌ని అరికట్టగలిగేమా మనం ?

ఇవన్నీ మార్చటం మనవల్ల అవుతుందా—ఆలోచించండి. ప్రతి దారుణం వెనుకా—కొన్ని ప్రచ్ఛన్న శక్తులు వున్నై. వాటిని ఎదుర్కొనాలి మనం.

**తుది పలుకు :**

అందుకని, మీరు అల్లరిచేసినా, ఈలలు వేసినా, చప్పట్లు కొట్టినా సరే—నేను చెప్పాల్సిన నాలుగు మాటలూ చెప్పక తప్పదు.

వినండి.

అడుగడుగునా దోపిడీకి గురవుతున్న మనమంతా ప్రతీప శక్తుల్ని ఎదిరించి నిలబడాలి. ఎక్కడ లోపం వున్నదో గమనించి ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలి. దీనికి జాగ్రత్త అవసరం. మనకు మనంగా మన పురోగమనానికి బాధ్యత వహించాలి. అప్పుడే ప్రగతి సాధ్యమౌతుంది.

మీరంతా ఒక మహత్తరమైన సంఘటిత శక్తి. మీలో ప్రతి ఒక్కరూ వొక్కొక్క ఆంజనేయులు. మీ శక్తిని మీరు తెలుసుకుంటే, మీకు అసాధ్యమైన పనిలేదు.

మీలో ఉద్యోగులున్నారు ; రైతులున్నారు ; కార్మికులున్నారు, కర్షకులున్నారు. శ్రామికులున్నారు, వర్తకులున్నారు.

మీ అందరికీ వేర్వేరు సమస్యలున్నై. వాటి పరిష్కారానికి మీరే పూనుకోవాలి. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని చేతులు ముడుచుకూర్చోవద్దు. లేవండి.

మీ శక్తిని మీరు గమనించండి. మీ చేతిలో, అతి శక్తివంతమైన ఆయుధం వుంది. అది ఏమిటో నేను చెప్పఖ్ఖర్లేదు. మీకు తెలుసు. దాన్ని జాగరూకతతో వుపయోగించండి. విజయం మీదే.

* * *

" ఏంపేటోయ్ — ఈ ఊక. " ఎవరో ఎవర్నో అడుగుతున్నారు.

నవ్వులు.

మనలో ఉద్యోగులున్నారు, రైతులున్నారు, కార్మికులున్నారు, కర్షకులున్నారు, శ్రామికులున్నారు, వర్తకులున్నారు — అవును సోమరులున్నారు, దగాకోరులున్నారు !

మళ్ళీ నవ్వులు !

" అసలు నిజమైన తొలిపలుకు చెప్తా విను. ఆయన అవినీతి ఆరోపణలమీద బర్తరఫ్ అయిన అధికారి. మలిపలుకు

తెలుసా. మొన్న ఎన్నికల్లో పోటీచేసి వోడిపోయి నిన్న పార్టీ మార్చేడు. ఇక తుదిపలుకేమో—ఆయనకి వూళ్ళో ఒక లాడ్జీ, ఒక సినిమాహాలూ, ఒక బారూ, వలభై లారీలూ వున్నై. అదీ సంగతి. "

* * *

" బస్ ఛార్జీకి డబ్బుల్లేవు. నాలుగు కాపర్స్ వుంటే పడెయ్‌రా "

" సారీ రా. నాదీ అదే సమస్య "

* * *

ఉపన్యాసాలు బాగున్నై. గొంగట్లో భోజనం సిద్ధంగా వుంది. వస్తా !

$0_0 0$